10

# వెర్రి వెంగళాయి కథ

అనగనగా ఒక ఊరిలో శంకరయ్య, పార్వతమ్మ అనే దంపతులు ఉండేవారు.

వారికి చాలాకాలానికి ఒక్కగానొక్క కొడుకు పుట్టాడు. వాడు చూడడానికి అష్ట వంకరలతో ఎంతో వికారంగా ఉండేవాడు. పైగా.., బుద్ధి కూడా సరిగా వికసించక 'మేధకుడు' గా ఉండేవాడు. అయినా... 'కాకి పిల్ల కాకికి ముద్దు!' అన్నట్టు... తల్లిదండ్రుల కంటికి వాడు ఎంతో అందంగా ఉండడంతో వాడికి 'సుందరం' అని పేరు పెట్టుకున్నారు.

చిన్నతనంలో వాడు చేసే ఆకతాయి పనులు ముద్దుగానే ఉంటూ వచ్చినా పెద్దవాడవుతుండేసరికి సుందరం తల్లిదండ్రులకు పెద్ద సమస్యగా తయారుకాసాగాడు. అందరూ వాడిని 'వెర్రి వెంగళాయి' అనేవారు.

ఒక రోజున శంకరయ్య, పార్వతమ్మలు కొడుకుని పిలిచి "నాయనా... సుందరం! మేం పెద్దవాళ్ళ మయ్యాం. నువ్వు పెళ్ళి చేసుకొని, కోడలు ఇంటికి వస్తే మాకు కొంత విశ్రాంతిగా ఉంటుంది. అలాగే - నువ్వు ఏదైనా పని చూసుకొని నాలుగు రాళ్ళు సంపాదిస్తే, ఇల్లు కాస్త సులువుగా గడుస్తుంది" అని చెప్పారు.

పెళ్ళంటే ఏమిటో తెలియని సుందరం అన్నిటికీ తలూపాడు.

త్వరలోనే సుందరానికి ఒక పేద పిల్లతో పెళ్ళి అయింది. కట్న కానుకల ప్రసక్తి లేనందువల్ల పిల్ల తలిదండ్రులు తమ అమ్మాయిని వాడికిచ్చి బరువు తీర్చుకున్నారు. ఆచారం ప్రకారం ఆరోజు సుందరం మూడు నిద్రలకని అత్తవారింటికి బయలు దేరాడు.

కొడుకు సంగతి బాగా తెలిసిన తల్లి - సుందరంతో "నాయనా! అక్కడ ఎక్కువగా మాట్లాడకు. అన్నిటికీ 'అవును...' 'కాదు...' 'చాలా బాగుంది...' 'అయ్యో పాపం..!' వంటి మాటలతో సరిపెట్టి ఊరుకో" అని బుద్ధులు చెప్పి పంపింది.



అత్తవారింట్లో- కొత్త అల్లుడు కదా...అని సుందరానికి ఉన్నదాంట్లోనే ఘనంగా విందు భోజనం ఏర్పాటు చేశారు.

మాటల సందర్భంలో మామగారు- "ఈమధ్య మహావ్యాధి వచ్చి మా బర్రెలతో సహా ఊళ్ళో చాలా పశువులు చచ్చిపోయాయి" అని అల్లుడితో చెప్పారు.

భోజనం కమ్మగా ఆరగిస్తున్న సుందరం "అలాగా... భలే బాగుంది!" అన్నాడు.

ఆ మాటలకు మామగారు ముఖం ముడుచుకున్నాడు. కొంచెంసేపటి తర్వాత "మీతో మా అమ్మాయికి పెళ్ళయిన వేళా విశేషం! మా పెద్దమ్మాయికి లేకలేక కొడుకు పుట్టిన వార్త ఈ రోజే తెలిసింది" అన్నాడు.

సుందరం "అయ్యో పాపం..!" అన్నాడు.

'ఇంక అల్లుడిని కదిలిస్తే ఇబ్బందే!' అని అత్తమామలు మంచి మాటలు చెప్పి వెంటనే అల్లుడిని పంపించేశారు.

అత్తవారింట కొత్త ముచ్చట తీరాక, ఇంక ఏదైనా కొలువు చేసి తన ప్రతాపం చూపాలనుకున్నాడు సుందరం. ఆ ఆలోచనతో వస్తున్న వానికి దారిలో ఒక దొంగల గుంపు ఎదురయింది. వాడి ఆలోచన తెలుసు కున్న వాళ్ళు- సుందరం తమకి పనికి వస్తాడని భావించి తమ గుంపులో కలుపుకున్నారు.

ఆ రాత్రి ఊరిలో ఒక దొంగతనానికి పథకం వేసుకుని, 'ఎప్పుడూ తేలిక వస్తువులకంటే బరువైన వస్తువులను దొంగిలించడానికే ప్రాధాన్యం ఇయ్యా' లని వాడికి చెప్పారు ఆ దొంగలు.

ఆ రాత్రి అందరూ కలిసి దొంగతనానికి వెళ్లారు. సుందరం ఒక తిరగలి చూసి అది అన్నిటికన్నా బరువుగా ఉండడంతో దానిని అవస్థపడుతూ దొంగిలించుకు వచ్చాడు. అది చూసి దొంగలు బాగా కోపంతో వాడిని కొట్టినంత పని చేశారు. అయితే అది వాడి మొదటి తప్పు కనక క్షమించారు.

మరో రోజు దొంగలు ఒక ధనవంతుడి ఇంటిలో కన్నం వేయడానికి వెళ్లారు. వెళ్లేముందు 'లోహంతో చేసిన వస్తువుల్నీ, తళతళా మెరిసే వస్తువుల్నీ వదలకుండా తప్పక తేవాలి' అని గట్టిగా చెప్పారు.

ఆ మాటలను మనసులో మననం చేసుకుంటున్న సుందరం కంటికి తళతళ మెరుస్తూ కంచుతో చేసిన జేగంట కనబడింది. అప్పటికి దొంగలు విలువైన వస్తువులన్నీ మూటలు కట్టుకున్నారు.

సుందరం గంట పుచ్చుకుని బయటపడ్డాడు. వెంటనే ఆ గంట గణగణమంటూ మ్రోగింది. దానితో ఇంట్లోని వారు, ఇరుగు పొరుగువారు లేచి దొంగల్ని పట్టుకుని, కొత్వాలుకి అప్పజెప్పారు.

మర్నాడు దొంగలనందరినీ న్యాయ విచారణ కోసం రాజుగారి ముందర హాజరు పరిచారు. అంతా విని రాజుగారు సుందరంపట్ల జాలి చూపారు.

"ఓరీ... నువ్వు వట్టి వెర్రి వెంగళాయి లాగున్నావు. ఏమైనా నువ్వు పరోక్షంగా దేశాన్ని పట్టి పీడిస్తున్న దొంగలు దొరకడానికి కారణ భూతుడవయ్యావు. అందువల్ల నిన్ను వదిలేస్తున్నాను" అని చెప్పి, దొంగల్ని మాత్రం కఠినంగా శిక్షించాడు.

పార్వతమ్మని, శంకరయ్యని పిలిచి - "మీ పిల్లవాడు మేధకుడు. ఏ పనిలోనూ రాణించలేడు. అందువల్ల అనవసరంగా వానిని శ్రమపెట్టకండి. సుందరం మాకు చేసిన ఉపకారానికి ప్రతిగా మీ జీవితాలు సుఖంగా వెళ్లిపోయేటట్లుగా మీకు పొలాన్నీ, గోవుల్నీ ఇస్తాను" అని చెప్పారు. అప్పటి నుంచీ 'వెర్రి వెంగళాయి' గా పిలువబడే సుందరం అనవసరంగా చిక్కుల్లో పడకుండా ఇంటి పట్టున సుఖంగా ఉండసాగాడు.

★★★